ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

బుధవారం 10 సెప్టెంబరు 2025

8 ఆస్పత్రుల్లో పడకల పెంపు

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



టెక్కలి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రితో పాటు మరో ఏడు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో పడ కల సంఖ్య పెంచేందుకు హెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. 'టెక్కలిలో ప్రస్తుతం 150 పడకలు ఉండగా.. దానిని 220కి పెంచాం. పాతపట్నం, (మిగతా 6వ పేజీలో..)



ఓ దుర్ఘటన ఆ గ్రామస్థులను మేల్కొలిపింది. ఊరంతా ఒక్కతాటిపైకి వచ్చేలా చేసింది. డీజేలను నిషేధించేలా చేసింది. ఇటీవల ఆ ఊరివారంతా సమావేశమయ్యారు. ఏ కార్యక్రమానికైనా డీజేలను వాడకూడదంటూ తీర్మానం చేశారు. వాడితే రూ.లక్ష జరిమానా విధించాలని నిర్ణయం తీసుకున్నారు. పోలీసు కేసు కూడా నమోదు చేయించాలని తీర్మానించారు.

ఆ శబ్దం మాకొద్దు



ఆదివారం కె.కపాసుకుద్దిలో డీజే నిషేధంపై సమావేశమైన గ్రామస్థులు

● డీజే పెడితే.. రూ.లక్ష జరిమానా

● పోలీసుకేసు కూడా నమోదు చేయిస్తాం

● కె.కపాసుకుద్ది గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం

● భావితరాల కోసం మంచి నిర్ణయం

కవిటి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

వివాహాలతోపాటు ఏ శుభకార్యమైనా.. వినాయకచవితి, దసరా తదితర పర్వదినాలైనా.. గ్రామదేవత పండుగలైనా సరే.. డీజే శబ్దాల మోత మోగుతోంది. ఎక్కడ చూసినా డీజేలు దర్శనమిస్తున్నాయి. కాగా ఆ భారీ శబ్దాలతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. చాలామంది గుండె సంబంధిత రుగ్మతలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కవిటి మండలం కె.కపాసుకుద్ది గ్రామస్థులు భావితరాల కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ఆదివారం గ్రామస్థులంతా సమావేశమయ్యారు. ఇకపై డీజే శబ్దాలు తమ గ్రామంలో వినిపించకూడదంటూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఒకవేళ ఎవరైనా డీజేలు పెడితే రూ.లక్ష జరిమానా విధిస్తామని, పోలీసు కేసులు కూడా నమోదు చేయిస్తామని గ్రామ పెద్దలు స్పష్టం చేశారు.

● కె.కపాసుకుద్దిలో సుమారు 250 ఇళ్లు ఉన్నాయి. 12 కులాలకు సంబంధించి దాదాపు 1,500 మంది నివసిస్తున్నారు. వీరంతా కలసికట్టుగా గ్రామ కట్టుబాట్ల కోసం డీజేల నిషేధాన్ని అమలు చేయనున్నారు. రెండేళ్ల కిందట డీజే శబ్దాలను తట్టుకోలేక గ్రామానికి చెందిన ఒకరు గుండెపోటుకు గురై మృతి చెందారు. అలాగే ఇటీవల చాలాచోట్ల ఇటువంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అధిక శబ్దాల తాకిడి తట్టుకోలేక గ్రామంలో చాలామంది బాధపడుతున్నారు. గర్భిణులు, యువకులకు సైతం ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అలాగే డీజే శబ్దాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా పక్కదారి పడుతున్నాయి. యువత వ్యసనాలకు బానిసై.. ఆ శబ్దాల నడుమ చేస్తున్న నృత్యాలతో.. సంస్కృతీ సంప్రదాయాలు మంటగలుస్తున్నాయి. భవిష్యత్ తరాలకు ఇది మంచి పద్ధతి కాదని పెద్దలు భావించారు. ఇకపై గ్రామంలో డీజే నిషేధించాలని తీర్మానించారు. ఈ తీర్మానానికి (మిగతా 6వ పేజీలో..)

ప్రతి రైతుకూ యూరియా పంపిణీ

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాతపట్నం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):ప్రతి రైతుకూ యూరియా పంపిణీ చేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మంగళవారం పాతపట్నం మండలం బూరగాం సచివాలయంలో ఎరువుల పంపిణీ పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మజ్జి రామారావు అనే రైతు.. తనకు ఇంతవరకూ ఒక్క యూరియా బస్తా కూడా అందలేదని కలెక్టర్ వద్ద వాపోయారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. 'ఎరువుల కోసం ఆందోళన వద్దు. రెండు.. మూడు రోజుల్లో యూరియా పంపనున్నాం. రైతులందరికీ పంపిణీ చేయిస్తాం. అధిక ధరకు విక్రయించినా, ఎవరైనా దుర్వినియోగం చేసినా వెంటనే సమాచారం ఇవ్వాల'ని తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ జగన్మోహన్‌రావు, సైంటిస్ట్ మధుకుమార్ మాట్లాడుతూ.. ఎకరాకు గరిష్ఠంగా 75 కేజీల వరకూ యూరియా మూడు దశల్లో వినియోగించాలని సూచించారు. యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు.

● అనంతరం రెవెన్యూ, మండల పరిషత్, సచివాలయ సిబ్బందితో కలెక్టర్ సమీక్ష (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్, కూటమి శ్రేణులు, ప్రజలు

6లో

ఆడపడుచుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

● ఎమ్మెల్యే గొండు శంకర్ ● ఘనంగా 'సూపర్ సిక్స్, స్త్రీశక్తి' పథకాల విజయోత్సవాలు



బాలుడిని రక్షించిన రెస్క్యూ సిబ్బంది

మంచి మార్కులు రావడం లేదని..

● మనస్తాపంతో నదిలో దూకిన బాలుడు

● కాపాడిన రెస్క్యూ సిబ్బంది

8లో


కారు డ్రైవరే చంపేశాడు

● సహకరించిన స్నేహితుడు ● బంగారం కోసమే ఘాతుకం

● వ్యాపారి హత్యకేసు ఛేదించిన పోలీసులు

● ఇద్దరు అరెస్టు.. 1.033 కిలోల బంగారం సీజ్

నరసన్నపేట,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని బంగారం వ్యాపారి హత్య కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కారుడ్రైవర్ అత్యాశకు పోయి.. స్నేహితుడితో కలిసి వ్యాపారిని హతమార్చినట్టు నిర్ధారించారు. ఒక కేజీ 33 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు వెల్లడించారు. 'బంగారం వ్యాపారి పొట్నూరు వెంకటపార్వతీశం గుప్త హత్య కేసులో శ్రీకాకుళం మండలం పెద్దపాడురోడ్డుకు చెందిన మొల్లి అప్పలరాజు(కారు డెకార్ యజమాని), నరసన్నపేటకు చెందిన కారుడ్రైవర్ జువ్వాది సంతోష్‌ను మంగళవారం (మిగతా 8వ పేజీలో..)



స్వాధీనం చేసుకున్న బంగారం బిస్కెట్లు



మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మణరావు, పక్కన సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు

ప్రతి రోజూ 'డయల్ యువర్ కలెక్టర్'

● ఎరువులపై నేరుగా పరిష్కారం

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇకపై ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఎరువులు, ఇతర వ్యవసాయ సంబంధిత సమస్యలపై నేరుగా కలెక్టర్‌తో మాట్లాడవచ్చన్నారు. **08942-222565, 08942- 222648** నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

30 ఫోన్‌కాల్స్.. :

సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి జిల్లాలో రైతుల నుంచి 30 ఫోన్‌కాల్స్ వచ్చాయి. సారవకోట మండలం నవతల గ్రామానికి చెందిన తూలుగు వెంకటరావు, కొత్తూరు మండలం సోమరాజపురానికి చెందిన మల్లేశ్వరరావు, సరుబుజ్జిలి మండలం ఎం.ఎస్.పురానికి చెందిన టి.ఈశ్వరరావు, పాతపట్నం మండలం గంగువాడకు చెందిన కె.నాయుడు తదితర రైతులు ఎరువులు అందడం లేదని తెలిపారు. వెంటనే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత మండల వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం ఆయా రైతులకు కలెక్టర్ ఫోన్ చేసి ఎరువులు అందాయా? లేదా? అని ఆరా తీశారు. వ్యవసాయాధికారులు తమకు కూపన్లు అందజేశారని, రెండు రోజుల్లో ఎరువులు సరఫరా చేస్తామని చెప్పారని తెలిపారు.

గుండె.. దడ!



● తెలంగాణలోని సింగరేణిలో డీజీఎం చిరంజీవులు ఈ ఏడాది ఏప్రిల్ 16న గుండెపోటుతో మృతి చెందారు. కొత్తూరు మండలానికి చెందిన ఈయన గత 50 సంవత్సరాలుగా సింగరేణిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇంట్లో రాత్రి భోజనం అనంతరం విశ్రాంతి తీసుకుంటుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు గమనించేసరికి చనిపోయారు.

● జూన్ 5న కంచిలిలో గ్రామదేవత సంబరాలకు హాజరైన సప్ప కళ్యాణ్ గుండెపోటుతో మృతి చెందారు. విశాఖకు చెందిన ఆయన సినిమా హీరోలకు డూప్‌గా వేషాలు వేస్తుంటారు. గ్రామదేవత పండుగకుగాను బృందంతో వచ్చారు. సమీప చెరువులో స్నానానికి దిగుతుండగా గుండెపోటుకు గురై అక్కడే ప్రాణాలు వదిలారు.

● జూన్ 30న జలుమూరు మండలం కూడంపాడు గ్రామానికి చెందిన వాన రాజగోపాలరావు అనే యువకుడు గుండెపోటుతో మృతిచెందాడు. సీఐఎస్ఎఫ్‌లో పనిచేస్తున్న ఆయన రాయచూర్‌లో గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. సహచరులు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు.

● జూన్ 1న శ్రీకాకుళం సానావీధిలో సచివాలయ ఉద్యోగి దాలి నాయుడు అనే యువకుడు గుండె పోటుతో మృతిచెందాడు. రాత్రి గుండెపోటు రాగా.. ఉదయం కుటుంబసభ్యులు గమనించారు. వైద్యసేవలు అందించినా ఫలితం లేకపోయింది.

● జూన్ 4న ఆమదాలవలసకు చెందిన యువ వైద్యుడు హర్షవర్ధన్ గుండెపోటుతో చనిపోయారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మంచి డాక్టర్‌గా గుర్తింపు పొందారు. కానీ గుండెపోటుతో అకాల మరణం చెందారు.

● శ్రీకాకుళం మండలం గోపీనగర్ పాఠశాల హెచ్ఎం స్వప్న ఆగస్టు 16న గుండెపోటుతో మృతిచెందారు. ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

● ఆగస్టు 10న మందస మండలం అంబుగాం గ్రామానికి చెందిన కదంబాల నాగేశ్వరరావు గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడు.

● పెరుగుతున్న గుండెపోటు మృతులు

● సాధారణ మరణాల్లో అవే 31శాతం

● తేల్చిన కేంద్ర గణన సంస్థ నివేదిక

● ముందే మేల్కొనకపోతే ముప్పే

రణస్థలం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):

ప్రస్తుతం ఎక్కడ చూసినా వయసుతో సంబంధం లేకుండానే గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయి. సాధారణ మరణాల్లో మూడొంతులు అవే ఉంటున్నాయి. ఇటీవల కేంద్ర జనగణన విభాగానికి చెందిన శాంపిల్ రిజిస్ట్రేషన్ సర్వేలో ఇదే తేలింది. దేశంలోని మరణాల్లో 31శాతం గుండెపోటు వల్లే సంభవిస్తున్నాయని తాజా నివేదికలో వెల్లడించింది. అయితే 30 ఏళ్ల వయసులోనే గుండెపోటు మరణాలు అధికంగా ఉన్నా యని ఈ నివేదిక చెబుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాలో కూడా గుండెపోటు మరణాలు పెరగడం చర్చనీయాంశమవుతోంది. జిల్లా వాసులు శ్రమజీవులు. గతంలో ఇటువంటి రుగ్మతలు అరుదు. కానీ ఇటీవల మారిన పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, మద్యం, పొగ తాగడం తదితర దురలవాట్ల మూలంగా వ్యాధులు చుట్టుముడుతున్నాయి. కొందరిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి కూడా గుండెపోటుకు దారి తీస్తోంది.

● రక్తప్రసరణే కీలకం

గుండెపోటు అనేది తీవ్ర సమస్యగా మారుతోంది. మిగతా రుగ్మతలు కొంత సమయ మిస్తాయి. కానీ గుండెపోటు అలాకాదు. వచ్చిన కొద్దిసేపటికే వైద్యసేవలు అందాలి. అన్నింటికీ మించి గుండెపోటు సంకేతాలు అందిన వెంటనే మనమే మేలుకోవాలి. వైద్యనిపుణులను సంప్రదించాలి. గుండెకు రక్తం సరఫరా చేసే నరాలు పూడికపోతాయి. అప్పుడు నరాలు చిట్లి రక్తం గడ్డ కడుతుంది. గుండెకు రక్తప్రసరణ తగ్గిపోతుంది. అప్పుడే గుండెపోటుకు దారితీసే అవకాశం ఉంటుంది. ముందస్తుగానే గుర్తించే చాలా పరీక్షలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. ప్రధానంగా కరోనరీ కాల్షియం స్కోర్ తెలుసుకోవడం ద్వారా గుండెపోటును నియంత్రించవచ్చు. కార్డియాక్ సిటీ స్కాన్ ద్వారా పరీక్షించు కోవచ్చు. ఇది రక్తనాళాల్లోని కాల్షియం మోతాదును లెక్కించి స్కోర్‌ను తెలియ జేస్తుంది. ఇది 0 నుంచి 1000కిపైగా అగట్‌స్టన్ యూనిట్ల వరకూ ఉండొచ్చు. దీని ద్వారా గుండెపోటు ముప్పును ముందుగానే అంచనా వేయవచ్చు. ఉదాహరణకు కాల్షియం స్కోర్ 0 ఉన్నవారికి పదేళ్లలో గుండెపోటు వచ్చే అవకాశం 1 నుంచి 6 శాతం మాత్రమే. 300 కంటే ఎక్కువ ఉన్నవారికి 13 నుంచి 26శాతం వరకూ గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుంది.

● ఆ పరీక్షలు చేసుకోవాల్సిందే..

గుండె కాల్షియం స్కోర్ పరీక్ష చాలా ఉపయోగపడుతుంది. షుగర్, హైబీపీ, అధిక కొలెస్ట్రాల్, శారీరక శ్రమ లేనివారు (మిగతా 6వ పేజీలో..)

బైపీసీ స్ట్రీమ్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీ సెట్‌ను బైపీసీ స్ట్రీమ్‌లో రాసిన అభ్యర్థులు వివిధ కోర్సుల్లో ప్రవేశానికి వెబ్‌కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి మంగళవారం విడుదల చేసిందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. 'బీఈ/బీటెక్ (బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్)తో పాటు బీ ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ కౌన్సెలింగ్ జరుగుతుంది. ఈ నెల 11 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 12 నుంచి 17 వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల అప్‌లోడ్, పరిశీలన జరుగుతుంది. 13 నుంచి 18 వరకు కళాశాలలు, కోర్సుల ఎంపికకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. 19న వెబ్‌ఆప్షన్లలో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. 21న సీట్లు కేటాయిస్తారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్ట్ కావాల'ని నారాయణరావు సూచించారు.

పర్యవేక్షణ లేక.. పక్కదారి పట్టి

● యథేచ్ఛగా పీడీఎస్ బియ్యం తరలింపు 8లో

● చోద్యం చూస్తున్న అధికారులు



ప్రతి చిత్రం.. అపురూపం

● చిత్రకళతో సిక్కోలుకు వన్నెతెచ్చిన వడ్డాది

● నేడు వడ్డాది పాపయ్య జయంతి 6లో



విలువైనది జీవితం.. కాపాడుకుందాం

● ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు

● నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం



రాయినింగారిపేట గెడ్డవద్ద ప్రవహిస్తున్న వరదనీరు

బుడుమూరు పెద్దగెడ్డకు వరద

● ప్రజల రాకపోకలకు అంతరాయం

● అధికారుల అప్రమత్తం 6లో

జాడుపల్లి పాఠశాలలో బురద

● తడిచిపోయిన రికార్డులు

● అవస్థలకు గురవుతున్న విద్యార్థులు 8లో

విలువైనది జీవితం.. కాపాడుకుందాం



- ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

టెక్కలి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో గత నాలుగేళ్లలో సుమారు 1,535 మంది వరకు వివిధ కారణాలతో ఆత్మహత్యలు చేసుకున్నట్టు పోలీసుల కథనం. వీటిలో ఎక్కువగా ప్రేమ వ్యవహారాలు, అక్రమ సంబంధాల వల్ల చోటుచేసుకున్న సంఘటనలే ఉంటున్నాయి.

ఒత్తిడితోనే..

అధిక శాతం ఆత్మహత్యలకు కారణం మానసిక ఒత్తిడేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు, ప్రేమ వైఫల్యం, కుటుంబ తగాదాలు వంటి అంశాలు ఒత్తిడికి కారణమవుతు న్నట్టు చెబుతున్నారు. దీన్ని మొదటి దశలో గుర్తించడం కీలకమని అంటున్నారు. కౌన్సెలింగ్, యాంటీ డిప్రెషన్ థెరపీ, సైకోథెరపీతో సాధారణ స్థితికి తీసుకురావచ్చునని మానసిక వైద్య నిపుణులు అంటున్నారు.

యువతే అధికం..

ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా విద్యార్థులే ఉంటున్నారు. మార్కుల ఒత్తిడి దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా 12 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు వయసు గల యువతీ యువకుల సంఖ్యే అధికం.

మనోధైర్యమే మందు..

మానసిక ఇబ్బందులు పడేవారికి మనోధైర్యమే మందు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలి. సమయానికి ఇంటికి రాకపోవడం... సరిగ్గా నిద్రపోకపోవడం వంటివి గమనించాలి. ఫోన్లను తరచూ పరిశీలించినా తెలిసిపోతుంది. మొదట్లోనే కౌన్సెలింగ్ చేస్తే ఆత్మహత్య ఆలోచనలను నివారించవచ్చు.

-పావని, వైద్యాధికారి, చాపర ఆరోగ్య కేంద్రం



- ఈ ఏడాది మే 22న టెక్కలి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఆంధ్రా మెడికల్ కళాశాల పీజీ విద్యార్థి ఎస్.మోతీలాల్(22) విశాఖ కేజీహెచ్‌లోని వసతి గృహంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబం నేటికీ తేరుకోలేకపోతోంది.



- ఈ ఏడాది జూన్ 10న మెళియాపుట్టి మండలం సిరియాఖండి గ్రామానికి చెందిన సునీత (19) అనే యువతి నేల బావిలో దూకి అత్మహత్య చేసుకుంది. నర్సింగ్ కోర్సు చేస్తున్న ఆ యువతికి ఉద్యోగం వస్తే కుటుంబాన్ని ఆదుకుంటుందని తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ వారికి నిరాశే మిగిలింది.
- ఈ నెల 5న ఆమదాలవలస మండలం చిట్టివల గ్రామానికి చెందిన నవీరి పూర్ణ (22) వరకట్న వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడింది.
- గత నెల 27న పాతపట్నంలో నివాసం ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన దీపికా కూమారి (23) ఉరి పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇలా ఏటా జిల్లాలో ఆత్మహత్యకు పాల్పడుతున్న వారి సంఖ్య పదుల్లో ఉంటోంది. చదువు ఒత్తిడి, ప్రేమ వ్యవహారాలు, ఆర్థిక సమస్యలు, వివాహేతర సంబంధాలు, అనారోగ్యం, ఒంటరితనం వంటి సమస్యల వల్ల ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

ఆ రైతు ఆత్మహత్యతో..

- దిక్కుతోచనిస్థితిలో కుటుంబం
- అవే అప్పుల బాధలు.. ఒత్తిళ్లు



బల్లెడ నరసింహ మూర్తి (ఫైల్)



నరసింహమూర్తి భార్య నీలవేణి

కంచిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన బల్లెడ నరసింహమూర్తి కౌలు రైతు. వయసు 58 ఏళ్లు. ఎకరా పొలం ఉంది. మరో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేశాడు. కానీ వ్యవసాయం కలిసి రాలేదు. పెట్టుబడి డబ్బులూ వచ్చేవి కాదు. దీంతో ప్రతి ఏటా అప్పులే. ఒత్తిళ్లు అధికమయ్యాయి. ఒత్తిళ్లను తట్టుకోలేక ఈ ఏడాది ఏప్రిల్ 9న నరసింహమూర్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి వరకు కంటికి రెప్పలా ఉన్న ఇంటి పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. ఆయనకు ఇద్దరు కుమారులు శ్రీను, ప్రవీణ్. తండ్రి ఆకస్మిక మృతితో కుమారులకు ఎటూ పాలుపోని పరిస్థితి. ఇప్పుడు తమ తండ్రి లేకపోగా, అవే అప్పుల బాధ, ఒత్తిడి తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయని నరసింహమూర్తి కుమారులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ తల్లి నీలవేణికి ప్రభుత్వం నుంచి వితంతు పింఛను కూడా అందడం లేదని వారు వాపోతున్నారు. శ్రీను, ప్రవీణ్‌లకు వివాహమైంది. ప్రస్తుతం కూలి పనులకు వెళుతూ తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నామని వీరు చెబుతున్నారు. సుమారు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు అప్పులు ఉన్నాయని అంటున్నారు. ప్రభుత్వం తమ పరిస్థితిని గుర్తించి... ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆడపడుచుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- ఎమ్మెల్యే గొండు శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆడపడుచుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా స్త్రీశక్తి పథకాన్ని అమలు చేస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో మంగళవారం సూపర్ సిక్స్ - సూపర్ హిట్, స్త్రీశక్తి పథకం విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత సూర్యమహల్ జంక్షన్ నుంచి మహిళలతో కలిసి ర్యాలీగా ఏడురోడ్ల కూడలికి ఎమ్మెల్యే చేరుకున్నారు. అక్కడ ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడపడుచులకు ఆస్తిలో సమాన హక్కును కల్పించడం, డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యాపారానికి వడ్డీలేని రుణాలు, దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, స్త్రీశక్తి వంటి పథకాలతో మహిళలను శక్తిమంతులుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. డ్వాక్రా, మెప్మాలను అనుసంధానం చేసి రూ.6 కోట్లతో పాత్రునివలస, కుందువానిపేటల వద్ద ఎంఎస్‌ఎంఈ పార్కుల నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పీఎం వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్ర-2047కు ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి సూపర్ హిట్ చేశామని ఆయన చెప్పారు. ప్రజలందరూ ప్రత్యేకంగా మహిళలు ఎంతో ఆనందంగా ఉన్నారని అన్నారు. నియోజకవర్గంలో 1000 మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. టిడ్కో ఇళ్లకోసం డబ్బులు చెల్లించిన వారందరికీ ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం అప్పులు చేసిందే తప్ప...సంపద సృష్టించలేదని విమర్శించారు. నేడు అభివృద్ధి, సంక్షేమం, సంపద సృష్టి స్తూ చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. గ్రామాల్లోని మహిళల అభివృద్ధి కోసం అందరం కృషి చేద్దామని మహిళలతో ప్రమాణం చేయించారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, రవికెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మహిళా నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



హాజరైన ప్రజలు

బుడుమూరు పెద్దగెడ్డకు వరద

- ప్రజల రాకపోకలకు అంతరాయం



అదపాక వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దగెడ్డ

లావేరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడుమూరు పెద్దగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మంగళవారం వివిధ గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. సోమవారం రాత్రి విజయనగరం జిల్లా చీపురుపల్లి, గరివిడి తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఆ నీటితో మంగళవారం ఉదయం 7 గంటలకు గెడ్డ ఉధృతంగా ప్రవహించింది. దీంతో అదపాక నుంచి గుర్రాలపాలెం, రాయినింగారిపేట, పాతరౌతుపేటల వద్ద గల కాజ్‌వేల పై నుంచి ఉదయం 11 గంటల వరకు నీరు భారీగా ప్రవహించింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. ఆ సమయంలో గుర్రాలపాలెం, పాతకుంకాం, కొత్తకుంకాం, పైడాయవలస నుంచి శ్రీకాకుళం వెళ్లాల్సిన వారు అవస్థలు పడ్డారు. వారంతా పెదకొత్తపల్లి మీదుగా చిలకపాలెం చేరుకుని..అక్కడి నుంచి శ్రీకాకుళం వెళ్లారు. రాయినింగారిపేట, పాతరౌతుపేట గ్రామాల ప్రజలు కేశవరాయునిపాలెం, మురపాక మీదుగా చిలకపా లెం వెళ్లి...అక్కడి నుంచి గమ్యాలకు చేరుకున్నారు. మంగళవారం వర్షం లేకపోవడంతో ఆ గ్రామాల ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షాలు కురిసి ఉంటే బుడుమూరు పెద్దగెడ్డ ఉధృతి మరింత పెరిగి ఉండేదని.. తద్వారా మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యేవని ఈ ప్రాంతీయులు అంటున్నారు.

అధికారులు అప్రమత్తం..

బుడుమూరు పెద్దగెడ్డ మంగళవారం ఉధృతంగా ప్రవహిస్తోందనే సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దారు జీఎల్‌వీ శ్రీనివాసరావు, ఎంపీడీవో పి.వెంకటపతిరాజు వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శులు హూటాహూటిన అదపాక- గుర్రాలపాలెం, రాయినింగారిపేట, పాతరౌతుపేట వద్దకు చేరుకున్నారు. అటువైపు ఎవరూ వెళ్లకుండా ప్రజలను అప్రమత్తం చేశారు. గెడ్డ ప్రవాహం రెండు, మూడు గంటల్లోనే తగ్గుముఖం పట్టడంతో ప్రజలు, అధికారులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.



రాయినింగారిపేట కాజేవే వద్ద తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

ప్రతి చిత్రం.. అపురూపం

- చిత్రకళతో సిక్కోలుకు వన్నెతెచ్చిన వడ్డాది
- నేడు వడ్డాది పాపయ్య జయంతి







వడ్డాది పాపయ్య గీసిన చిత్రాలు

ఎచ్చెర్ల/ శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు చిత్ర కళా సౌందర్యానికి ఆయన వడ్డాణం వంటివారు. తెలుగు చిత్ర కళారంగంలో అందాల హరివిల్లుగా వికసించిన కళాబ్రహ్మ ఆయన. ఆయనే సిక్కోలు ఖ్యాతిని నలుదిక్కులా వ్యాపించేలా చేసిన చిత్ర కళా చక్రవర్తి వడ్డాది పాపయ్య. వ.పా.గా తెలుగు పాఠకులకు పరిచయమాయన. పురస్కారాల కోసమో... ప్రశంసల కోసమో ఆయన బొమ్మలు గీయలేదు. కళ కోసమే తపించి, కళాభిమానుల కోసమే చిత్రాలను గీసిన మహనీయుడుగా గుర్తింపు పొందారు. శ్రీకాకుళం నగరంలో 1921 సెప్టెంబరు 10న వడ్డాది పాపయ్య జన్మించారు. శ్రీకాకుళంలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేసిన తన తండ్రి శ్రీరామ్మూర్తి మార్గదర్శకంలో ఐదో ఏట హనుమంతుని బొమ్మను గీసి చిత్రకళారంగంలో తన అభిరుచిని చాటుకున్నారు వడ్డాది. భారతీయ పురాణ, ఇతిహాసాల పై విద్యార్థి దశలోనే పట్టుసాధించి ఆ దిశగా తన చిత్రకళా ఆసక్తికి, తన భావాలకు కుంచె ద్వారా మెరుగులు దిద్దుకున్నారు. రవివర్మ, దామెర్ల రామారావులను గురువులుగా భావించి పాపయ్య చిత్రకళారంగంలో తనకంటూ ఓ స్థానాన్ని సుస్థిర పరుచుకున్నారు. చిత్రకారునిగా ఎంతో పేరొందిన ఆయన నిరాంబర జీవితానికే ఇష్టపడేవారు. సాదాసీదా తెల్లపంచె... అదే రంగు లాల్చీ ధరించి తెలుగుదనం ఉట్టిపడేలా కనిపించేవారు. నిశీధిని సైతం నిశితంగా... సునిశితంగా పరిశీలించే ఆ కళ్లే ఆయనకు ప్రత్యేకం. ఆ స్వప్న చక్షువులతో వీక్షించిన ఎన్నో సుందర దృశ్యాలు కళాభిమానులను ఆకట్టుకున్నాయి.

ప్రత్యేక ముద్ర

అప్పట్లో 'భారతి'లో పాపయ్య గీసిన నాగేశ్వరుడు, ఆంధ్రజ్యోతిలో వేసిన రతీ మన్మథ చిత్రాలు సంచలనం సృష్టించాయి. మంజూష, రేరాణి, అభిసారిక, అవినీతి, నవ్వులు-పువ్వులు పత్రికల్లో ఆయన గీసిన చిత్రాలను చూసిన చక్రపాణి స్వాతి, చందమామ పత్రికలకు చిత్రకారునిగా మద్రాసుకు ఆహ్వానించారు. రాగాలతో రోగాలు నయమవుతాయనే నమ్మే వడ్డాది పాపయ్య శివరంజని, హిందోళ, కన్నడ, శహన, జయజయవంతి, అహిరభైరవ రాగాలకు భావయుక్తమైన చిత్రాలను గీశారు. ఆయన కుంచె నుంచి జాలువారని చిత్రం లేదంటే అతిశయోక్తి కాదు. పురాణ పురుషులు, పల్లె పడుచులు, కావ్య నాయికలు, జాతీయ నాయకులు, వివిధ కాలాలు, రుతువులు, జానపద విన్యాసాలు, పండుగలు, ఆచార వ్యవహారాలు, రాగాలు, నదులు, ఊహా లోకాలు... ఇలా ఒకటేంటి... మనిషిలోని, ప్రకృతిలోని అన్ని భావాలను, రూపాలను తన చిత్రాల ద్వారా చూపించారు. అందుకే ఆయన గీసిన చిత్రాల కోసం ఒకనాడు తెలుగు నేలపైన సామాన్యుడి నుంచి మేధావుల వరకూ ఎదురు చూసేవారు. నేటికీ అవి సజీవ చిత్రాలుగానే నిలుస్తున్నాయి.

పత్రికలకు ప్రాణంగా..

1940-90 మధ్యలో తెలుగు నేలపై ప్రచురితమైన వివిధ పత్రికలు, జర్నల్స్‌కు వడ్డాది పాపయ్య గీసిన చిత్రాలు ఊపిరినిచ్చాయి. ఆ పత్రికలు ప్రచురించే కథలు, నవలలకు పాపయ్య గీసిన చిత్రాలు ఎంతో ప్రాచుర్యాన్ని తెచ్చాయి. చిత్రకారుడిగానే కాకుండా కార్టూనిస్ట్‌గా, బొమ్మల కథా రచయితగా బహుముఖ ప్రజ్ఞను చూపించారాయన. 1940వ దశకంలో చిన్నారులను ఆకట్టుకోవడానికి ఆయన బాల పత్రికలో గీసిన చిత్రాలు ఎంతో తమాషాగా, ఆహ్లాదంగా ఉండేవి. చిత్రాలతో పాటు యువ, ఆనందవాణి, నవ్వులు-పువ్వులు తదితర పత్రికల్లో గీసిన వందలాది కార్టూన్లు తెలుగు వ్యంగ్య చిత్ర కళలకు ఉత్తేజాన్ని నింపాయి. చందమామ, కథా మంజూష పత్రికల్లో ఎన్నో కథలను రాశారు. శరత్‌చంద్ర నవలలకు ఆయన గీసిన బొమ్మలు నాటి పాఠకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. లోకం నిద్రలోకి జారుకున్నాక తన రంగుల ప్రపంచంలోకి ఆయన ప్రవేశించేవారు. ప్రశాంత వాతారణంలోనే చిత్రాలను గీసేవారు.

నిరాడంబరతే ఇష్టం..

నిరాడంబరత అంటేనే ఆయన ఇష్టపడేవారు. మానవీయతకు దగ్గరగా, ప్రచారానికి, ప్రశంసలకు దూరంగా ఉంటూ.. పంచె కట్టులోనూ, కుంచె పట్టులోనూ అసలు సిసలైన తెలుగువానికి నిలువుటద్దంగా నిలిచారు. తన మరణాన్ని ముందుగా ఊహించి... చరమ చిత్రం చిత్రించుకున్న మహా చిత్రకారుడు వడ్డాది. దానిని స్వాతి సపరివార పత్రికలో ప్రచురించారు. పత్రికలకు చిత్రాలు అందించే నిమిత్తం మద్రాసులో బిజీ జీవితాన్ని గడిపిన పాపయ్య... దాని నుంచి బయటపడి తనకు నచ్చిన జీవనయానానికి అనకాపల్లికి సమీపంలోని కశింకోటకు చేరుకున్నారు. అక్కడే శారదా నది ఒడ్డున వ.పా. వనం నిర్మించుకుని తన కుమార్తె కుటుంబంతో కలిసి చివరి రోజులు గడిపారు. 1992 డిసెంబరు 30న వడ్డాది తుది శ్వాస విడిచారు.

ప్రతి రైతుకూ యూరియా పంపిణీ

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహించారు. రైతులకు యూరియాకు అందకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. 'బూరగాం ఆర్‌ఎస్‌కే పరిధిలో బూరగాం, సీతారాంపల్లి, బోరుభద్ర గ్రామాల్లో 867 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇంతవరకు 19.98 టన్నుల(440 బస్తాలు) యూరియా సరఫరా చేశాం. ఇంకా 600 మంది రైతులకు యూరియా సరఫరా చేయాల్సి ఉంద'ని అధికారులు తెలిపారు. వ్యవసాయ శాఖ, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది మధ్య సమన్వయలోపంతో స్పష్టమైన వివరాలు చెప్పకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయి వివరాలు తన కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. తహసీల్దార్ నందిగాం ప్రసాదరావు, ఎంపీడీవో పి.చంద్రకుమారి, మండల వ్యవసాయాధికారిణి కిరణవాణి, మండలప్రత్యేకాధికారి డా.మంచు కరుణాకర్ పాల్గొన్నారు.

- ఇదిలా ఉండగా వర్షాకాలంలో మహేంద్రతనయ నది దాటి తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని బూరగాం రైతులు కలెక్టర్ వద్ద ఏకరువు పెట్టారు. వంతెన నిర్మించాలని కోరారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఆ శబ్దం మాకొద్దు

(ఐదో పేజీ తరువాయి)

తామంతా కట్టుబడి ఉంటామని గ్రామస్థులు తెలిపారు.

● అనర్థాలెన్నో..

వాస్తవానికి డీజేలను నిషేధించినట్టు పోలీస్ శాఖ చెబుతున్నా.. ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. డీజే శబ్దాల రోతకు దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. శబ్దం తీవ్రత పెరిగే కొలదీ రుగ్మతలు ఖాయమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. '60 డెసిబుల్స్‌లోపు శబ్దం వింటే ఎటువంటి ఇబ్బందులుండవు. కానీ పరిమితికి మించి రెట్టింపు డెసిబుల్స్ వినియోగిస్తున్న కారణంగా అనర్థాలు తప్పవు. వినికిడి లోపంతో పాటు మానసిక వ్యాధులు కలుగుతాయి. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఈ శబ్దం వింటే పెను ప్రభావం చూపుతుంది. ఇటువంటి వాటికి దూరంగా ఉండడం మేలు' అని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీజే నిషేధంపై కె.కపాసుకుద్ది గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం ఆదర్శనీయంగా ఉందంటూ పలువురు పేర్కొంటున్నారు.

భక్తిభావం పోతోంది..



గ్రామంలో డీజే వలన భక్తిభావం పోయి విష సంస్కృతి అలవాటు కావ డం మంచిదికాదు. యువత వ్యసనా లకు బానిస కాకుండా, ఆధ్యాత్మికత పెంచేలా డీజేల నిషేధంపై నిర్ణయం తీసుకున్నాం.

-తోట ధర్మరాజు, గ్రామస్థుడు, కె.కపాసుకుద్ది

డీజేతో అనర్థమే..



గ్రామంలో రెండేళ్ల కిందట డీజే శబ్దం కారణంగా గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందారు. ఇటీవల ఈసంస్కృతి పెరిగి అన్ని ప్రాంతాల్లో అనర్థాలు జరుగుతున్నాయని గ్రహించాం. ఈ సిస్టమ్ వలన యువకులు, మహిళలు వ్యసనాల బారిన పడి కుటుంబాలను నాశనం చేసుకోకుండా ఉండాలని డీజే నిషేధానికి శ్రీకారం చుట్టాం.

-పి.శ్రీరాములు, గ్రామస్థుడు, కె.కపాసుకుద్ది

అమలు చేస్తాం..



గ్రామస్థులమంతా కలసి డీజే నిషేధం అమలుకు ప్రయత్నిస్తాం. డీజేల వద్ద దైవ కార్యక్రమాల్లోను విష సంస్కృతితో భక్తిభావం తగ్గిపోతోంది. యువకులు వ్యసనాలకు బానిస కాకుండా చూసేందుకు ఇది మంచి నిర్ణయంగా భావిస్తున్నాం.

-పి.హరిహరరావు, గ్రామస్థుడు, కె.కపాసుకుద్ది

గుండె.. దడ!

(ఐదో పేజీ తరువాయి)

కుటుంబంలో అప్పటికే గుండెపోటు వచ్చినవారు, పొగతాగేవారు, ఊబకాయం ఉన్నవారు ఈ పరీక్షలు చేసుకుంటే చాలా మేలు. 35 నుంచి 40 ఏళ్ల వయసులో ఒకసారైనా కాల్షియం స్కోర్ పరీక్ష చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కానీ ఎట్టి పరిస్థితుల్లో గర్భిణులు మాత్రం చేయించుకోకూడదు. 3 నుంచి 5 సంవత్సరాలకు ఒకసారి కాల్షియం స్కోర్ పరీక్ష చేయించుకోవడం చాలా ఉత్తమం. ఒకవేళ కాల్షి యం స్కోరు ఎక్కువగా ఉంటే కొలెస్ట్రాల్ తగ్గించే స్టాటిన్లు వేసుకోవడం, మరింత వ్యాయామం చేయ డం, ఆహారంలో మార్పులు చేసుకోవడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం, తరచూ డాక్టర్లను సంప్రదించడం వంటి జాగ్రత్తలతో పెద్ద ప్రమాదం నుంచి కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

● ముందు జాగ్రత్త అవసరం



గుండెపోటు అనేది తీవ్ర రుగ్మత. కానీ ముందుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదు. షుగర్, హైబీపీ ఉన్నవారు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఈసీజీ, టీఎంటీ, ఎకో వంటి వైద్య పరీక్షల ద్వారా గుండె సమస్యలు తెలుసుకోవచ్చు. కాల్షియం స్కోరు పరీక్ష చేసుకోవడం చాలా ఉత్తమం. శరీరానికి అవసరమైన వ్యాయామం, ఆరోగ్య సూత్రాలు పాటించాలి.

-ముద్దాడ యుగంధర్, ఎండీ, జనరల్ మెడిసిన్, కొండములగాం సీహెచ్‌సీ, రణస్థలం

8 ఆస్పత్రుల్లో పడకల పెంపు

(ఐదో పేజీ తరువాయి)

పలాస కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు 50 పడకలకు, బారువ, సోంపేట, బుడితి, కొత్తూరు, హరిపురం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో 30 పడకలకు పెంచాం. దీనివలన ఇన్‌పేషెంట్ రోగులకు పడకల సౌకర్యాలతోపాటు డైరెక్టర్ సెకెండరీ హెల్త్ నుంచి క్వార్టర్లీ మందులు బడ్జెట్ పెంపునకు అవకాశం ఏర్పడింది. ప్రత్యేక నిపుణుల వైద్యులకు 50శాతం జీతభత్యాలను ప్రభుత్వం పెంచింది. వైద్యసేవల్ని మరింత విస్తృతపరచాలనే ఉద్దేశంతో చర్యలు తీసుకుంటున్నామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. టెక్కలిలో ఆస్పత్రికి పడకల పెంపుపై మార్కెట్ కమిటీ ఛైర్మన్ బగాది శేషగిరి, నందిగాం మండల పార్టీ అధ్యక్షుడు పినకాన అజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

ఎరువుల వినియోగంపై అవగాహన ఉండాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గార, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మంగళ వారం తూలుగు గ్రామ సచివాలయ వద్ద రైతులతో మాటాడుతూ.. ఖరీఫ్‌లో వరి పంటకు అవసరమైన ఎరువులను తగిన మోతాదులో వాడడం వల్ల తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. అవసరాన్ని మించి ఎరువులు వాడడం వల్ల పంటకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉంటుందని, రైతులకునష్టం వాటిల్లుతుందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నా మన్నారు. కొందరు రైతులు తమకు యూరియా అందుబాటులో లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ఈ విషయమై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపీడీవో ఈ.రఘు, వ్యవసాయాధి కారి డి.పద్మావతి, సర్పంచ్ ప్రతినిధి కె.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: జేసీ

జి.సిగడాం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హెచ్చరించారు. మంగళవారం సర్వేశుపురంలో ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడినా, నిబంధలను ఉల్లంఘించినా షాపులు సీజ్ చేయటం జరుగుతుందన్నారు. అంతకు ముందు బాతువ రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎరువుల కొరత నివారణకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ప్రతీ రైతుకు ఎరువు అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

దుష్ప్రచారాలను నమ్మొద్దు: ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ఎరువుల సరఫరాపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ మైదానంలో విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనమే లక్ష్యంగా 70 శాతం సబ్సిడీపై ఎరువులను సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి రైతుకు ఎకరానికి యూరియా అందిస్తామని, దీనిని మూడు విడతలుగా సరఫరా చేస్తున్నామని చెప్పారు. తొలి విడతలో ఎకరాకి 25 కిలోల చొప్పున ఇప్పటికే సరఫరా చేశామన్నారు. రెండు, మూడు విడతలకు సరిపడా యూరియా నిల్వలను సిద్ధం చేస్తున్నామని రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

యూరియాపై అవగాహన కల్పించండి: పీడీ

సరుబుజ్జిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ వరి సాగు చేస్తున్న రైతులకు యూరియాతో పాటు ఇతర ఎరువుల వినియోగంపై క్షేత్ర స్థాయి అధికారులు అవగాహన కలిగించాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం సింధువాడ గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ ఉద్యోగులతో యూరియా కొరతపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ ఖరీఫ్ అవసరమైన యూరియాను, ఇతర ఎరువులను వ్యవసాయ శాఖ సరఫరా చేసిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయశాఖ సూచనలు పాటించకుండా మోతాదుకు మించి వాడుతు న్నారని తెలియవచ్చిందన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బి.రామారావు, ఏపీఎం కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: పెంట గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

యూరియా కోసం రైతుల బారులు

జి.సిగడాం/ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు రైతు సేవా కేంద్రాలకు తరలివచ్చారు. జి.సిగడాం మండలం పెంట, ఇచ్ఛాపురం బెల్లుపడ గ్రామాల్లోని సేవా కేంద్రాలకు పలు గ్రామాలకు చెందిన రైతులు వచ్చి బారులు తీరారు. పెంట గ్రామంలో 220 యూరి యా బస్తాలు రాగా కొందరికే అందాయి. దీంతో మిగిలిన రైతులు ఆందోళనకు గురయ్యారు. చాలీచాలని యూరియా రావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని ఏవో బెండు బాబ్జీ అన్నారు. బెల్లుపడ రైతు సేవా కేంద్రానికి కేవలం 153 బస్తాలు మాత్రమే రావడంతో గంటల తరబడి రైతులు వేచి ఉన్నా అందరికీ అందలేదు. దీంతో పలువురు రైతులు నిరాశతో వెనుదిరిగారు. 89 మంది రైతులకు యూరియా అందించగా మిగిలిన 51 మందికి టోకెట్లు అందించినట్లు ఏవో అజయ్‌కుమార్ తెలిపారు. రైతు సేవా కేంద్ర వద్దకు తహసీల్దార్ ఎన్.వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, ఏవో అజయ్ కుమార్ వచ్చి రైతులకు నచ్చజెప్పారు. ఒకానొక దశలో రైతులు వాగ్వాదానికి దిగగా పోలీసులు జోక్యం చేసుకుని వారిని వారించారు.



ఇచ్ఛాపురం: బెల్లుపడ సచివాలయం వద్ద..

న్యూస్ బాక్స్

బీజేపీ బలోపేతానికి కృషి

జి.సిగడాం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ప్రతి గ్రామంలో 15 రోజుల పాటు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, నేతలు బూరాడ వెంకటరమణ, సాకేటి నాగరాజు, పాండూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

లావేరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బెజ్జిపురం వద్ద ఉన్న ఒక ప్రైవేటు రైస్ మిల్లులో పేకాట ఆడుతున్న ఐదుగురిని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. వీరి వద్ద నుంచి 8,300 నగదు స్వాధీనం చేసు కుని కేసు నమోదు చేసినటు పేర్కొన్నారు.

15 నుంచి 'రణభేరి'

కంచిలి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఆర్థిక రంగం సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న రణభేరి జాతన జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మురళీ నాయక్, ప్రధాన కార్యదర్శి నల్లాన రవి తదితరులు పాల్గొన్నారు.

అదనపు భారం మోపొద్దు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై అదనపు భారాన్ని మోపొద్దని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు బల్లెడ రవి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియను మంగళవారం చేపట్టారు. పెండింగ్ డీఏలను విడుదల చేయా లని, మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతం ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నవీన్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

ఆమదాలవలస, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్‌ను దసరా కానుకగా ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ డిమాండ్ చేశారు. మంగళవారం కొర్లకోట, చీమలవలస, వెదుళ్లవలస, కొత్తవలస, నిమ్మతొర్లాడ, తొగరాం, దూసి పాఠశాలల్లో సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగుల వేతన సవరణను సకాలంలో చేపడతామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రమేష్‌కుమార్, ఎస్.రామచంద్ర, హెచ్‌ఎం జి.ఉమారాజు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాల రక్షణలో 108 కీలకం: శంకర్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాల రక్షణలో 108 అంబులెన్స్ సేవలు కీలకమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ మైదానంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 108 అంబులెన్స్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన, నాణ్యమైన సేవలను ఈ అంబులెన్స్ ద్వారా అందు తాయన్నారు. కార్యక్రమంలో 108 జిల్లా సమన్వయకర్త డా.ప్రకాశరావు, ఆర్ఎం బాలరాజు, మేనేజర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేసేలా చర్యలు: అశోక్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రైతులకు అవస రమైన పనులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవా లని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి. అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో మంగళవారం విద్యుత్, ఉపాధి హామీ, ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ కనెక్షన్లు ఇప్పిం చాలని రైతు లు కోరుతున్నారని, ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథ కం ద్వారా ఎంతమేర పనులు జరిగాయని పీఆర్ అధికారులను ప్రశ్నిం చారు. రోడ్లు, కాలువల నిర్మాణ దశలను అడిగి తెలుసుకున్నారు. నియో జకవర్గంలో అభివృద్ధి పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల అధికారులు పాల్గొన్నారు.

రామ్మోహన్ కుమారుడికి మంత్రి లోకేశ్ ఆశీస్సులు



చిన్నారిని ముద్దాడుతున్న మంత్రి లోకేశ్

శ్రీకాకుళం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నివాసంలో ఆయన కుమారుడికి రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆశీస్సులు అందించారు. రామ్మో హన్ నాయుడుకు ఇటీవల కుమారుడు జన్మించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని ఆయన ఇంటికి లోకేశ్ వెళ్లారు. చిన్నారిని ఎత్తుకున్నారు. అక్కడే ఉన్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి సతీమణి మాధవీలతను యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

మాజీ స్పీకర్ తంగి సత్యనారాయణకు ఘన నివాళి



తంగి సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం లీగల్ సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించిన తంగి సత్యనారాయణ 95వ జయంతి వేడుకలు మంగళవారం బార్ అసోసియేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిం చారు. రాజకీయాల్లోకి రాకముందే తంగి సత్యనారాయణ శ్రీకాకుళం బార్ అసోసియేషన్ సభ్యుడిగా, న్యాయవాదిగా వ్యవహరించారన్నారు. జిల్లా అభివృద్ధికి ఆయన విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో స్టేట్ బార్ అసోసియేషన్ ప్రతినిధి గేదెల వాసుదేవరావు, జిల్లా సంఘం అధ్యక్షుడు తంగి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదర్, సీని యర్ న్యాయవాదులు వాన కృష్ణచంద్, ఎ. మురళీ మోహనరావు, పొన్నా డ వేంకటరమణారావు, తంగి చంద్రశేఖర్, ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సదస్సును జయప్రదం చేయండి

ఆమదాలవలస, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 13న జరగనున్న రాష్ట్ర పెన్షనర్ల సంఘం సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. మంగళవారం ఉపఖజానా కార్యాలయ ఆవరణలో సంఘ సమావేశం నిర్వహించారు. సంఘం నేతలు బొడ్డేపల్లి మోహన్‌రావు, సురవరపు సిమ్మినాయుడు పాల్గొన్నారు.

ప్రధాన రైళ్లను పొడిగించండి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రధాన రైళ్లను పొడిగించాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు, రైల్ యూజర్స్ కమిటీ అధ్యక్షుడు కట్టా సూర్యప్రకాష్ కోరారు. ఈ మేరకు మంగళ వారం రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్‌నాథ్ కొట్లా, సౌత్ సెంట్రల్ రైల్వే, చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ బి.రవిచందర్‌ను కలిసి వినతిపత్రాలు అందించారు. భువనేశ్వర్-విశాఖపట్నం వందేభారత్ రైలును కాకినాడ వరకు, విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను లింగంపల్లి(హైదరాబాద్) వరకు పొడించాలని కోరారు.

శ్రీకూర్మం జంక్షన్‌లో విద్యుత్ వెలుగులు



శ్రీకూర్మం జంక్షన్‌లో వెలుగుతున్న లైట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గార, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం జంక్షన్‌లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'శ్రీకూర్మం జంక్షన్‌లో అంధకారం' శీర్షికతో వచ్చిన కథనానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పందించారు. వెంటనే ఎంపీడీవో ఈశర్ల రఘుతో మాట్లాడారు. వీధి లైట్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. గత కొన్ని నెలలుగా వీధిలైట్లు లేక అంధకారంలో ఉన్న ఈ జంక్షన్‌లో లైట్లు ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. సమస్య పరిష్కా రానికి చొరవ తీసుకున్న ఆంధ్రజ్యోతికి, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పురటాలపోలమ్మ పండుగ

ఆమదాలవలస, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిట్టివలస గ్రామంలో గ్రామదేవత పురటాల పోలమ్మ అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ జి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో చీరపోలమ్మ దాసురాలు ఇంటి వద్ద తొలుత తల్లి ఘటానికి పూజించి గ్రామమంతా ఊరేగించారు. ఆలయా నికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. బిందెల డ్యాన్స్, రాక్షస వేషాలు ఆకట్టుకున్నాయి.

చికిత్స పొందుతూ మరో వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. పెద్దపాడు జంక్షన్ సమీపంలో ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో కింజరాపు గంగరాజు, పల్లెన తారకేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కింజరాపు గంగరాజు పరిస్థితి విషమించి సోమవారం శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తారకేశ్వరరావుకు ఉన్నత చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించి అక్కడ చికిత్స అందించారు. అతడి ఆరోగ్యం విషమించి మంగళవారం మృతి చెందాడు. శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

దత్తనాథ క్షేత్రంలో విజయానందతీర్థ

శ్రీకాకుళం కల్చరల్ సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): దత్తవిజయానంద తీర్థ 22వ చాతుర్మాస్య వ్రత పరిసమాప్తం సందర్భంగా మంగళవారం స్థానిక చిం దత్తనాథ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దత్తక్షేత్రం నూతన భవనాలు అభివృద్ధి చేయాలని, భక్తులకు సౌకర్యంగా ఉండేటట్లు చూడాలని సూచించారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఈనెల 14వ తేదీ వరకు ఉత్తరాంధ్రలో గ్రామాల పర్యటన చేపడుతున్నామన్నారు.

'ఒలింపియాడ్' విజేతలకు అభినందన

కంచిలి, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇండియన్ స్కూల్ ఆఫ్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ చూపిన కంచిలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం సర్టిఫికేట్లను అందజేశారు. ఈ మేరకు ఎంఈవోలు ఎస్.శివరాం ప్రసాద్, చిట్టిబాబు సర్టిఫికేట్లు, నగదు ప్రోత్సాహకాలు అందించి అభినందించారు. హెచ్‌ఎం చదువుల జగన్నాథం, గైడ్ ఉపాధ్యాయుడు నల్లాన రవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

లావేరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.వెంకటరాజు తెలిపారు. అధికారులతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

సహకార రంగం బలోపేతమే లక్ష్యం

● ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సహకార సంస్థలను బలోపేతం చేసి లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవి కుమార్ అన్నారు. లోలుగు కాలనీ సమీపంలో రూ.40 లక్షల నాబార్డ్ నిధులతో నిర్మించిన పీఏసీఎస్ గోడౌన్ ను మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం సహకారరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కోల్డ్‌స్టోరేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పొందూరుతో పాటు ఇతర ప్రాంత రైతులకు సౌకర్యంగా ఉండేలా గోడౌన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని జిల్లా సహకార ఆడిట్ అధికారి చంటిబాబు, డీసీసీబీ జీఎం ఎస్.జగదీష్, పొందూరు పీఏసీఎస్ చైర్మన్ వండాన మురళికి సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూన సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెపు రాము, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరభాస్కర్, తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీవో సింహాచలం, పీఏసీఎస్ సీఈవో వై.పాపినాయుడు, పొందూరు డీసీసీబీ మేనేజర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మలకాం (జాడపేట) గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే రవికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ గోడౌన్ ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

న్యాయసేవలకు సహకరించండి

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న వివిధ న్యాయ సేవలు ప్రజలకుచేరువ అయ్యేలా స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు కోరారు. మంగళవారం స్థానిక సంస్థ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించడంలో స్వచ్ఛంద సంస్థలు కీలకపాత్ర వహించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి రమణ, డిఫెన్స్ న్యాయవాది ఆఫీస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

జిల్లాలో వైసీపీ 'అన్నదాత పోరు'

● నేతల హౌస్ అరెస్ట్

శ్రీకాకుళం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ పిలుపు మేరకు మంగళవారం 'అన్నదాత పోరు' నిరసన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా జరిగింది. ఎక్కడికక్కడ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేశారు. టెక్కలిలో ఆ పార్టీ నేతలు ధర్మాన కృష్ణదాస్, కుంభారవిబాబు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు మాట్లాడుతూ.. యూరియా సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, తక్షణం అందజేయాలని డిమాండ్ చేశారు. నరసన్నపేటలో నిరసన ఉద్రిక్తంగా మారగా పోలీసులు జోక్యం చేసుకున్నారు. పలాసలో అన్నదాత పోరు నిర్వహిం చేందుకు సిద్ధమైన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును కాశీబుగ్గ పోలీసులు గృహ నిర్బం ధంచేశారు. డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ పి.సూర్యనారా యణ, పోలీసులు ఆయన నివాసానికి వెళ్లి బయటకు రాకుం డా అడ్డుకున్నారు. ఆమదాలవలసలో మాజీ స్పీకర్ తమ్మి నేని సీతారాం, నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌లను వారి ఇళ్ల వద్దే పోలీసులు నిర్బంధించారు. కవిటి మండలం బల్లిపుట్టుగలో జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయమ్మతో పాటు పార్టీ నేతలను, కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ ఎన్.రామారావులను పోలీసులు అడ్డుకున్నారు.

రణస్థలంలో అన్నదాత పోరు కార్య క్రమంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూట మి ప్రభుత్వం విఫలమైందన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇతర ప్రాంతా ల్లోనూ నిరసన ప్రదర్శనలకు దిగిన నేతలను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు.

జీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న జీడి కార్మికులు

అరసవల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జీడి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని సీఐటీయూ, జీడి కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జీడి కార్మికులకు పూర్తిస్థాయి పని దినాలు కల్పించాలని, కాల్చిన పిక్కలను పరిశ్రమలో పని చేసిన కార్మికులకు యాజమాన్యాలు ఇవ్వకుండా వేరే ప్రాంతాలకు తరలిస్తుంటే అధికారులు ఎందు కు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గత 26 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు పని ఇవ్వకుండా చేస్తున్నారన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, కార్మిక చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మ న్నాయుడు, కార్యదర్శి గణపతి, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జీడి కార్మిక సంఘ నాయకులు అల్లు హేమలత, సీహెచ్ చంద్రమ్మ, జానకమ్మ, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గాల అభ్యున్నతికి 'సురవరం' విశేష కృషి

గుజరాతీపేట. సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతానికి జీవితాంతం కట్టుబడి పనిచేసి కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ అన్నారు. స్థానికంగా మాజీ ఎంపీ, పార్టీ సీనియర్ నేత సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే కమ్యూనిజం భావాలకు ఆకర్షితుడై జీవితాంతం వాటినే అనుసరిస్తూ దేశంలోని అనేక పోరాటాల్లో కీలకపాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, వివిధ సంఘాల నాయకులు ఎం.యుగంధర్, కె.మోహనరావు, ఎల్.వెంకటరావు, చాపర సుందర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆమదాలవలస, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) జిల్లా అధ్యక్షుడు పైడి రామస్వామి నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో మండల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రామస్వామి నాయుడును ఎంఈవో కేపే రాములు, సంఘం మండల అధ్యక్షుడు షేక్ షావలి సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఏపీటీఎఫ్ నాయకుడు పి.మోహన్‌రావు, జీటీఏ మండల ప్రధాన కార్యదర్శి బీఏ శివరాజ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం పైల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచి మార్కులు రావడం లేదని..

● నాగావళి నదిలో దూకిన బాలుడు ● రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంచి మార్కులు రావడం లేదన్న కారణంతో మనస్తాపం చెంది ఓ బాలుడు మంగళవారం నగరంలోని డేఅండ్ నైట్ కూడలి సమీపంలో బ్రిడ్జిపై నుంచి నాగావళి నదిలోకి దూకిన ఘటన సంచలనం కలిగించింది. వివరాలిలా ఉన్నాయి.. ఓంస్వరూప్ నగరంలోని ఓ ప్రైవేటుపాఠశాలలో నాలుగోతరగతి చదువుతున్నాడు. బాలుడి తండ్రి రమేష్ రెల్లవీధిలో నివాసం ఉంటూ అంబేడ్కర్ జంక్షన్‌లో శీతల పానీయాలు విక్రయిస్తూ జీవిస్తున్నాడు. నదిలో దూకిన బాలుడిని ఆ సమయంలో ఓ పాల వ్యాపారి చూసి తన వద్ద ఉన్న తాడును విసరగా బాలుడు దానిని పట్టుకున్నాడు. అటుగా వెళుతున్న పలువురు వెంటనే ఫైర్ ఆఫీస్‌కు ఫోన్ చేశారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని రెస్క్యూ చేసి బాలుడిని సురక్షితంగా కాపాడారు. అనంతరం బాలుడిని ఏడీఎఫ్‌వో శ్రీనుబాబు ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్యానికి అప్పగించారు. సహచర విద్యార్థులు తనకు మంచి మార్కులు రావడం లేదని అంటున్నారని, దీంతో మనస్తాపం చెంది నదిలో దూకానని ఓంస్వరూప్ తెలిపాడు. ఈ రెస్క్యూలో ఫైర్ సిబ్బంది బీఎస్ నాయుడు, సురేష్, రామస్వామి, వెంకటరావు, శ్రీనివాసరావు, రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకుని ఒకరి మృతి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దంత గ్రామానికి చెందిన బొమ్మాళి ఆదయ్య (60) మంగళవారం నిప్పు అంటుకుని మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఆదయ్య మంచంపై పడుకొని సిగరెట్టు తాగుతున్నాడు.ఒక్కసారిగా అది మంచంపై ఉన్న బట్టలకు అంటుకొని మంటలు వ్యాపించాయి. దీంతో ఆదయ్య తీవ్రంగా గాయపడడంతో గ్రామస్థులు గాయపడిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈమేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. ఆదయ్యకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హత్య కేసులో ఆరుగురు అరెస్టు

ఆమదాలవలస, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన అరసవల్లి హరమ్మ హత్య కేసులో మంగళవారం ఆరుగురు నిందితులను అరెస్టుచేసినట్లు సీఐ పి.సత్యనారాయణ తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఈనెల 3న కొత్త వలసలో వినాయక నిమజ్జన సమయంలో తలెత్తిన కొట్లాట కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. ఈ కొట్లాటలో గాయపడి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 4న హరమ్మ మృతిచెందారు. ఈఘటనలో విచారణ అనంతరం దవళ లక్ష్మణరావుతోపాటు మరో నలుగురిని, ఒక మైనర్‌ను హత్యాయత్నం కింద కేసు నమోదు చేశామన్నారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హరమ్మ మృతిచెందిన సమాచారం తెలుసుకున్ననిందితులు అరెస్టు భయంతో పోలీసులను తప్పించుకు తిరుగుతున్నారన్నారు. ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలోసిబ్బంది వివరాలు సేకరిస్తుండగా.. నిందితులు కొర్లకోట సమీపంలో ఉన్నట్టు మంగళవారం సమాచారం రాగా వెంటనే అక్కడికి వెళ్లివారిని అదుపులోకి తీసుకున్నారు.నిందితులను అరెస్టుచేసి కోర్టు న్యాయాధికారి ఎదుట ప్రవేశ పెట్టామని సీఐ తెలిపారు. నిందితుల్లో ఒక బాలుడు ఉండడంతో అతడిని జువైనల్ కోర్టులో హాజరుపరిచి న్యాయాధికారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలరాజు, హెచ్‌సీ కాంతారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

● రూ.లక్ష వంతున జరిమానా: ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం/ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.లక్ష వంతున జరిమానా విధిస్తూ ఒకటో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పునిచ్చినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జరిమానా కట్టకుంటే ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారన్నారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. 2022లో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కె.నుమండి గ్రామానికి చెందిన ఘనశ్యాం బెహరా, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పురుషోత్తపురం గ్రామం చిన్నవీధికి చెందిన రెయ్యిత్రినాథం, పైలవాసులు గంజాయిని క్రయవిక్రయాలు చేస్తూ పట్టుబడ్డారు. ఇచ్ఛాపురం మండలం పురుషోత్తపురం శ్మశాన వాటిక వద్దకు 2022 నవంబరు 11న ఘనశ్యాం బెహరా ఒడిశా రాష్ట్రం కొండ వద్ద అటవీ ప్రాంతంలో రైతుల వద్ద కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై తీసుకువచ్చి రేయి త్రినాథ్, పైలా వాసుకు 33 కిలోలు గంజాయిని అమ్ముతుండగా అప్పటి ఇచ్ఛాపురం టౌన్ ఎస్ఐ కూన గోవిందరావుకు వచ్చిన సమాచారం మేరకు సదరు వ్యక్తులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.99 వేలు విలువైన 33 కేజీల గంజాయి, బైక్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసి అప్పుడే కోర్టులో హాజరు పరిచారు.కేసు పూర్వాపరాలు పరిశీలించి ఒకటోఅదనపుజిల్లా సెషన్స్‌కోర్టు న్యాయాధికారి మంగళవారం తీర్పుఇచ్చినట్లు ఎస్పీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పిడుగుపాటుకు ఐదు మేకల మృతి

హరిపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని బొగాబంద చెరువు వద్ద సోమవారం రాత్రి సందూరుకు చెందిన గొర్రెల కాపరి దాసరి దాలయ్యకు చెందిన ఐదు మేకలు పిడుగు పాటుకు మృతిచెందాయి. కాపరులు సురక్షితంగా బయటపడ్డారు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిబంధనల మేరకు మద్యం విక్రయాలు

నరసన్నపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సర్కిల్ పరిధిలోని నరసన్నపేట, పోలాకి మండలాల్లో మద్యం షాపుల్లో నిబంధనల మేరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఎక్సైజ్ సీఐ జీవీరమణ తెలిపారు. మంగళవారం నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ సారవకోట మండలంలోని అవలంగిలో ఇటీవల కల్తీమద్యం పట్టుబడిన నేపథ్యంలో దుకాణాల్లో తనిఖీలు నిర్వహించినా, కల్తీ మద్యం పట్టుబడలేదని చెప్పారు. అవలంగి మద్యం దుకాణం లైసెన్స్‌దారునికి నరసన్నపేట సర్కిల్‌తో ఎటువంటి సంబంధంలేదని చెప్పారు. సర్కిల్ పరిధిలో 120 మంది బెల్టుషాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ గురుమూర్తి పాల్గొన్నారు.

కారు డ్రైవరే చంపేశాడు

(ఐదో పేజీ తరువాయి)

అరెస్టు చేశాం. గతనెల 26న గుప్త.. కారులో డ్రైవర్ జువ్వాది సంతోష్‌తో కలిసి విశాఖపట్నం బంగారం కొనేందుకు వెళ్లారు. తిరిగొస్తున్న సమయంలో కారుడ్రైవర్ సంతోష్. తన స్నేహితుడు అప్పలరాజుతో ముందస్తు పథకం ప్రకారం బంగారం కాజేయాలని భావించాడు. ఈ క్రమంలో కారును పెద్దపాడు రోడ్డువైపు మళ్లించి.. అప్పలరాజు షాపులోకి తీసుకెళ్లి గుప్తను హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని మరొక కారులో ఎక్కించి.. పాత్రునివలస వద్ద రామిగెడ్డలో పడేశారు. గత నెల 30న గుప్త సోదరుడు మన్మధరావు.. గుప్త కనబడడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయగా.. ఈ నెల 5న రామిగెడ్డలో గుప్త మృతదేహం లభించింది.

కారుడ్రైవర్ సంతోష్‌పై అనుమానంతో దర్యాప్తు చేయగా అసలు బండారం బయట పడింది. నిందితులను మడపాం టోల్‌ప్లాజా సమీపంలో అరెస్టు చేశాం. వారి నుంచి ఒక కేజీ 33 గ్రాముల బంగారం బిస్కెట్లు, చిన్న ముక్కలు, కడ్డీలను స్వాధీనం చేసుకున్నాం. హత్యకు ఉపయోగించిన తాడు, రెండు కార్లు, ఒక సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నాం. ఈ కేసు వ్యవహారంలో అప్పలరాజు వద్ద బంగారం కొనుగోలు చేసిన శ్రీకాకుళంలో ఒక బంగారం వ్యాపారిని కూడా అరెస్టు చేస్తామ'ని డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. ఈ కేసు చేధించిన నరసన్నపేట సీఐ మరడాన శ్రీనివాసరావు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, రంజిత్, అశోక్‌బాబు, అనిల్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

పర్యవేక్షణ లేక.. పక్కదారి పట్టి

●యథేచ్ఛగా పీడీఎస్ బియ్యం తరలింపు ● గిరిజన, ఉద్దాన ప్రాంతాల్లో సేకరణ ● చోద్యంచూస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు



గిరిజన ప్రాంతాల్లో కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యం బస్తాల్లో నిల్వచేసిన దృశ్యం

పలాస రూరల్,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకోసం ఉచితంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పంపిణీచేస్తున్న బియ్యం పర్యవేక్షణలేకపోవడంతో యథేచ్ఛగా పక్కదారిపడుతున్నాయి. కొందరు వ్యాపారులు గిరిజన,ఉద్దాన ప్రాంతంలో తక్కువ ధరకు సేకరించి తరలిస్తున్నారు. బియ్యం అక్రమంగాసేకరణ అడ్డుకోవల్సిన సివిల్‌సప్లయ్ అధికారులు చోద్యంచూస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి.

పలాస మండలంలోని ఉద్దానంతో పాటు గిరిజన, పట్టణప్రాంతాల్లో పీడీఎస్ బియ్యం పంపిణీ జరుగుతున్న సమయంలోనే టోకువ్యాపారుల ఆధ్వర్యంలో కొనుగోలుచేసి బస్తాల రూపంలో ఇతర ప్రాం తాలకు తరలిస్తున్నారు. ఇక్కడి ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణలేకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా కొనుగోలు చేసుకొని రీస్లైక్లింగ్ కోసం తరలిస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. పలాస మండలపౌరసరఫరా అధికారికి పలాసతోపాటు మందస మండలం ఇన్‌చార్జిగా ఉండడంతో పూర్తి స్థాయిలో పర్యవేక్షణకొరవడిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కోటబొమ్మాళి నుంచి ఒడిశా వైపు వెళ్తున్న ఓ వ్యాన్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పలాస హైవేపై పోలీసుల తనిఖీలో పట్టుబడిన విషయం విదితమే. పలాస మండలంలోని ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో ఉదయం సాయంత్రం వేళల్లో గ్రామీణ ప్రాంతాల్లో బియ్యం సేకరణ జరుగుతోంది. కిలో రూ.20 నుంచి రూ.22 వరకూ టోకు వ్యాపారులు కొనుగోలుచేస్తున్నారని తెలుస్తోంది. గతంలో పలాస మండలంలోని సున్నాడలో అక్రమంగా కొనుగోలుచేసి నిల్వచేసిన పీడీఎస్‌బియ్యం అధికారులు పట్టుకున్న విషయం విదితమే. ఈ తర్వాత ఇక్కడ అధికారులు పరిశీలించకపోవడంతో మళ్లీ పీడీఎస్ బియ్యం వ్యాపారం ఊపందుకుందన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా పౌరసరఫరాలు, రెవెన్యూ ఉన్నతాధికారులు పరిశీలించి అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.కాగా పీడీఎస్ బియ్యంపై ప్రత్యేక దృష్టిసారించి కొనుగోలు చేయ కుండా అధికారులను అప్రమత్తం చేస్తామని జిల్లా సప్లయ్ అధికారి సూర్యప్రకాశరావు తెలిపారు.

జాడుపల్లి పాఠశాలలో బురద

● తడిచిపోయిన రికార్డులు ● అవస్థలకు గురవుతున్న విద్యార్థులు

మెళియాపుట్టి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జాడుపల్లి జడ్పీ పాఠశాలకు బురద సమస్య వేధిస్తోంది. ఇక్కడ 142 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాడు-నేడు పథకం కింద ఈ పాఠశాల మంజూరుకావడంతో పనులు చేపట్టారు. అయితే బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టరు పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో చిన్నపాటి వర్షంకురిసినా కారుతుండడంతోపాటు తరగతి గదుల్లోకి నీరు రావడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ఐదు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. వర్షం కురిస్తే కొన్ని గదుల్లోకి నీరుచేరుతోంది. దీంతో ఆ సమయంలో బోధన జరగడం లేదు.ప్రధానంగా కొండపక్కన పాఠశాల ఉండడంతో వర్షం కురిస్తే మైదానంలో నీరు నిల్వఉంటోంది.తరగతి గదుల్లోకి కూడా చేరుతుంది. సోమవారం తరగతులు జరుగుతున్న సమయంలో వర్షం కురవడంతో గదుల్లోకి నీరుచేరింది.ఆ సమయంలో విద్యార్థులు ఇబ్బందులకుగురయ్యారు.అయితే మంగళవారం ఎంఈవో దేవేంద్రరావు, ఎంపీటీసీ కదంబల సుజాతపైడిరాజ్ పాఠశాల గదులు పరిశీలించి ప్రత్యామ్నాయ ఏర్పాటుచేశారు.కొండల నుంచి వస్తున్న వరద నీరును బయటకు వెళ్లేలా బట్టీతీసి రోడ్డుపైకి మళ్లించారు. రికార్డులు తడిచిపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఎంఈవో దేవేంద్రరావు

నీట్‌కు శిక్షణ ఇవ్వాలి: డీవీఈవో

నరసన్నపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది నుంచి నీట్, ఐఐటీ, ఎంసెట్‌లో విద్యార్థులు రాణించేందుకు శిక్షణ ఇవ్వాలని డీవీఈవో సురేష్‌కుమార్, ఆర్‌ఐవో దుర్గారావు సూచించారు. మంగళవారం నరసన్నపేట ప్రభుత్వ జూనియర్‌కళాశాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అడ్మిషన్ల పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మొదటి సంవత్సరం ప్రశ్నపత్రాల కూర్పులో బోర్డు మార్పుచేయడంలో విద్యార్థులకు ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలపై తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. అధ్యాపకుల టీచింగ్ డైరీ,నోట్స్ ఎండీఎం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ పాల్గొన్నారు.

● పాతపట్నం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో ఇష్టపూర్వకంగా చదవాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఆర్.సురేష్‌కుమార్, జిల్లాప్రాంతీయ పర్యవేక్షణాధికారి దుర్గారావు తెలిపారు.మంగళవారం పాతపట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డులను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ టి.హేమసుందరరావు ఉన్నారు.



నరసన్నపేట:రికార్డులను పరిశీలిస్తున్న డీవీఈవో సురేష్‌కుమార్

పంట నష్టంపై అధికారులకు తెలియజేస్తాం



ముంపునకు గురైన పంటపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పాతపట్నం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి):పాతపట్నం పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు వ్యవసాధికారులు తెలిపారు. మంగళవారం పాతపట్నంలోని నీలకంఠేశ్వరుని ఆలయం వెనుకభాగంలో గుమ్మగెడ్డ పరీవాహక ప్రాంతంలో ముంపుకుగురైన పంటపొలాలను వ్యవసాయశాఖ టెక్కలి ఏడీఏ జగన్మోహనరావు, శాస్త్రవేత్త సైంటిస్టు మధు కుమార్ పరిశీలించారు. వీరివెంట ఏవో కిరణవాణి, ఏఈవో భారతి, వీఏఏ ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో కొనసాగాలి

● దత్తపీఠ ఉత్తరాధికారి విజయానంద తీర్థస్వామీజీ

నందిగాం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్నిటికంటే సేవ చాలా గొప్పదని, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో కొనసాగాలని దత్తపీఠ ఉత్తరాధికారి విజయానంద తీర్థస్వామీజీ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పెద్దతామరాపల్లి, కాపుతెంబూరు గ్రామాల్లో దత్తపల్లి సందర్శనలో భాగంగా పర్యటించారు.ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో అనుగ్రహ సందేశంఇచ్చారు.సంకీర్తనలు, సత్సంగాలు, కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు.స్వామీజీని దత్త భక్తులు మేళతాళాలు మధ్య ఊరేగింపుగాతీసుకువెళ్లారు. ఉమామహేశ్వరశర్మ నేతృత్వంలో అనగష్ట వ్రతం వందలాదిమంది భక్తులతో నిర్వహించారు. దీంతో గ్రామాల్లో భక్తి పరవశం నెలకొంది. కార్యక్రమంలో దత్తపీఠ ప్రతినిధి కె.నారాయణరావు, కాపుతెంబూరు దత్త పీఠాధిపతి నిర్వీశ్యానంద స్వామీజీ, ఆయా గ్రామాలకు చెందిన దత్త ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



పెద్దతామరాపల్లిలో అనుగ్రహ సందేశం ఇస్తున్న విజయానంద తీర్థ స్వామీజీ

అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో జారీ

●ఆదీఆంధ్రావీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేసిన ఐసీడీఎస్ పీడీ విమల

టెక్కలి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వీరరామకృష్ణాపురం అంగన్‌వాడీ కార్యకర్త విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో మెమో జారీచేయాలని ఐసీడీఎస్ పీడీ విమల సీడీపీవోను ఆదేశించారు. మంగళవారం టెక్కలిలోని ఆదీఆంధ్రావీధి, వీరరామకృష్ణాపురం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పీడీ విమల తనిఖీచేశారు. ప్రీస్కూల్ నిర్వహణ, పిల్లల్లో క్రమశిక్షణ, మెనూ అమలు పరిశీలించారు. ఆమెతో పాటు మణమ్మ, నోడల్ అధికారి విద్య, సంధ్య, ఈశ్వరమ్మ, సరస్వతి ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ విమల

పేదలకు వైద్యసేవల్లో రాజీలేదు

కాశీబుగ్గ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం పేదలకు వైద్యవిద్య సేవలందించడంలో రాజీపడకూడదని ఏపీ టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబురావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు తెలిపారు. మంగళవారం కాశీబుగ్గ సంతమైదానంలో 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, జోగ త్రివేణిమల్లేశ్వరరావు, జి. సూర్యనారాయణ, డి.తులసీశంకర్, చక్రధర్,కొండే నర్సింహులు,శ్రీను పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి: డీపీవో

కోటబొమ్మాళి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య తెలిపారు. మంగళవారం కోటబొమ్మాళిలో ఈనెల 23 నుంచి 25వరకు కొత్తమ్మతల్లి జాతర పురస్కరించుకుని ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణతో మాట్లాడి జాతరకు సంబంధించి సూచనలుచేశారు. జాతర జరిగే మూడు రోజులు పారిశుధ్యపనులు పూర్తిస్థాయిలో నిర్వహించాలని, ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ ప్రాంగణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని, అందుకు అవసరమయ్యే కార్మికులను శ్రీకాకుళం తదితర ప్రాంతాలను తీసుకురావాలని అధికారు లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఐవీబరమణ, డిప్యూటీ ఎంపీడీవో ఆనందరావు, పంచాయతీ ఇన్‌చార్జి ఈవో చింతాడ సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రంగా ఉంచాలి

జలుమూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) ఆసుపత్రిలోను, ఆవరణలో ప్రతిరోజూ పారిశుధ్యపనులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో తాడేల శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కోరారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలన్నారు.

కళింగ కోమట్ల కార్యవర్గం ఎన్నిక వాయిదా

నరసన్నపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) కళింగ కోమట్ల జిల్లా కార్యవర్గం ఎన్నికకు సంబంధించి సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈనెల 14వ తేదీకి వాయిదావేశారు. మంగళవారం నరసన్నపేటలోని ఓ కళ్యాణ మండపంలో కళింగ కోమట్ల సంఘ జిల్లా కార్యవర్గ ఎన్నికకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళింగ కోమటి సంఘ రాష్ట్ర నాయకుడు బోయన గోవిందరాజులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ సూచనల మేరకు జిల్లా కార్యవర్గం ఎన్నుకునేందుకు నిర్ణయించారు.

దాడి చేశారని ఏపీఎం ఫిర్యాదు



కొత్తూరులో నిరసన తెలుపుతున్న వెలుగు సిబ్బంది

కొత్తూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):తనపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదుచేశానని వెలుగు ఏపీఎం ఎ.లలిత తెలిపారు. మంగళవారం సిబ్బందితో జూమ్ సమావేశం జరుగుతుండగా విలేకరులమని పేర్కొని దాడిచేశారని పేర్కొన్నారు.ఈమేరకు తనకు ప్రాణహానిఉందని కార్యాలయం ఎదుట ఆందోళనచేశారు. విధులకు ఆటంకం కల్పించడంతో పోలీస్‌లు కేసునమోదు చేసి కాపాడాలని ఫిర్యాదు చేసినట్లు లలిత తెలిపారు.

యూరియా పంపిణీకి చర్యలు

● రసాయన ఎరువుల వినియోగం వల్ల నష్టాలను వివరించిన అధికారులు

యూరియా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు స్పష్టంచేశారు. మంగళవారం జిల్లాలోని పలుచోట్ల క్షేత్రస్థాయిలో అధికారులు అధికారులు పర్యటించారు. రసాయన ఎరువుల అధిక వినియోగించడం వల్ల నష్టాలను రైతులకు వివరించారు.

●ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) రైతులందరికీ యూరియా పంపిణీచేసేందుకు శాఖాపరమైన చర్యలు చేపడతామని కొత్తూరు డివిజన్ అగ్రికల్చర్ ఏడీ బి. రాజగోపాల్ తెలిపారు. కృష్ణాపురంలో రైతులతో యూరియా పంపిణీపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడి సాధించాలంటే రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, వీటితో భూసారం తగ్గిపోయి భవిష్యత్‌లో పంటలు పండించేందుకు వీలులేకుండా పోతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో కె. సింహాచలం, రెవెన్యూ కార్యదర్శి కె. జోగినాయుడు, బి. పద్మజ పాల్గొన్నారు.

●జలుమూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, సరిపడ ఎరువులు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఏవో పి.అరుంధతిదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని పాగోడు, కరవంజ గ్రామాల్లో గల రైతులకు యూరియావాడకంపై అవగాహన కల్పించారు. యూరియా రైతులు విచక్షణారహితంగా వాడకుండా వ్యవసాయాధికారులు సూచనలు పాటించాలని కోరారు.కార్యక్రమంలో తహసీల్దారు జె.రామారావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఏవో కె.రవికుమార్ పాల్గొన్నారు.



జలుమూరు: పాగోడులో యూరియా వాడకంపై వివరిస్తున్న అధికారులు

నేడు స్కూల్ గేమ్స్ ఎంపికలు

నరసన్నపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలస్థాయిలో అండర్ -14, 17 విభాగాల్లో స్కూల్‌గేమ్స్ ఎంపికలు బుధవారం నిర్వహించనున్నట్లు పీడీ ఎంవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగ పోటీలకు ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.మండలంలోని పాఠశాలల్లో చదివేవిద్యార్థులు నేరుగా ఎంపికకు హాజరు కావాలని సూచించారు.

కుంటిబద్రలో పోటీలు

కొత్తూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):కుంటిబద్ర జడ్పీ పాఠశాలలో జిల్లాస్థాయి క్రీడాపోటీల కోసం మంగళవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు గోవిందరావు, శ్రీనివాసరావు, హెచ్ఎం బీవీ రమణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అగతముడి అరుణ బాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నరసన్నపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధి హామీ పథకంఏపీవోలు, టీఏలు,సీవోలు యుగంధర్, బాలు తదితరులు కోరారు.ఈ మేరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన సిబ్బంది జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలను పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.

హిందీ భాష నేర్చుకోవాలి

జలుమూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు మాతృభాషతో పాటు జాతీయ భాషగా గుర్తింపు పొందిన హిందీ భాషను నేర్చుకోవాలని ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు.మంగళవారం మండలంలోని అచ్యుతాపురం ఉన్నతపాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవం పురస్కరించుకొని జాతీయ హిందీ పక్షోత్సవాల్లో భాగంగా గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాదరావు, హిందీ ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణారావు, హెచ్ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు ఐ.మాధవరావు, ఎం.షణ్ముఖరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పలాస రూరల్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలకు మహిళా,బాల్యవివాహాల చట్టాలపై అవగాహన అవసరమని కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో పార్వతి తెలిపారు. మంగళవారం పలాస మండల పరిషత్ కార్యాలయంలో సంకల్పఅవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ చట్టాలు, వాటి ప్రత్యేక అంశాలపై వివరించారు. బాలసదనాలు,శిశుగృహాల్లో చట్టాలపై తెలియజేయాలని కోరారు. పోక్సో, కిశోరివికాసంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించడమే సంకల్ప సదస్సు లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గంగమ్మ, లత, ఎఎన్ఎం,ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతాను జయప్రదం చేయండి

నందిగాం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైనసమస్యలను పరిష్కరించాలని చేపట్టనున్న రణభేరి జాతాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కిషోర్‌కుమార్ కోరారు. మంగళవారం నందిగాం ఉన్నతపాఠశాల ఆవరణలో రణభేరికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 19 వరకు జాత నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, జిల్లా కార్యదర్శులు బాలక శంకరరావు, కె.రమేష్; మండలశాఖ అధ్యక్షులు కె.కుమారస్వామి, కార్యవర్గ సభ్యులు సురేష్, అప్పలస్వామి, జ్యోతి, ఢిల్లీరావు, శివ పాల్గొన్నారు.

● నరసన్నపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తామరాపల్లి యూపీ పాఠశాలలో రణభేరి పోస్టర్‌ను యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఈనెల 15న పలాసలో ప్రారంభించి నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నరసన్నపేట మీదుగా శ్రీకాకుళం వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు కోరాడ వైకుంఠరావు, టి. సుధీర్, ఎన్. అప్పలనాయుడు, పాఠశాలలో హెచ్ఎం అసిరినాయుడు, వాసు. మల్లేశ్వరి, రోజా , శోభారాణి పాల్గొన్నారు.